

అరకులోయలో వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని ఆర్ఐ టిఐ జంక్షన్ వద్ద మంగళవారం అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.హిమగిరి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో అరకు నుండి విశాఖపట్నం కు వెళ్లే వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, అక్రమంగా గంజాయి రవాణా జరుగుతుందన్న సమాచారంతో ప్రతి ఒక్క వాహనాలను క్షుణ్ణంగా డాగ్ తో తనిఖీల్లో చేస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మైనర్లు వాహనం నడిపినా, వారికి వాహనం ఇచ్చిన యజమానులపై తగు చర్యలు చేపడతామని తెలిపారు.


తనిఖీలు చేస్తున్న పోలీసులు

సమస్యల నడుమ మల్లెపాడు

-ఊటనీరే గతి- రోడ్డు సౌకర్యం లేక తప్పని డోలీ మోతలు -అవస్థలు పడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -అనంతగిరి: కనీస మౌలిక వసతులు లేక మల్లెపాడు గ్రామ ఆదివాసి గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు, తాగునీటి. . వంటి సౌకర్యాలు కల్పించిన పాపాన పాలకులు పోలేదు. మండలంలోని లుంగపర్తి పంచాయతీ పరిధి మల్లేపాడుకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గర్భిణీలు, .బాలింతలు, రోగులు వైద్యం కోసం ఆసుపత్రులకు తరలించాలంటే ఎత్తయిన అటవీ ప్రాంతం కొండ కోనల నడుమ 6 కిలోమీటర్ దూరం డోలీలో మెయిన్ రోడ్డుకు తరలిస్తున్నారు. అక్కడ నుండి 108 అంబులెన్స్ లేదా ఇతర ప్రైవేటు వాహనాలలో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులకు తరలించవలసి వస్తుంది. రోడ్డు మార్గం లేకపోవడంతో ఇల్లు కట్టుకునేందుకు ఇతర సామాగ్రి తరలించాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లులు కట్టుకోలేని పరిస్థితితో వదిలివేశారు. తక్షణ కూటమి ప్రభుత్వం రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు


కర్రలకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఊట నీటిపైనే ఆధారం..

గ్రామంలో 20 కుటుంబాలపైగా నివసిస్తున్నారు. బావి, పైపు లైన్ వంటి పథకాలు ఏర్పాటు చేయలేదు. ఎత్తైన కొండ వాగు వద్ద ఉన్న చిన్న పాటి ఊట నీటిని సేకరించి జీవనం కొనసాగిస్తున్నారు. వేసవికాలం కావడతో ఊటనీరు అట్టడుగునకు ఇంకిపోతుంది. తక్షణమే పైపులెన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు

రేకు షెడ్డులో పాఠశాల, అంగన్వాడి నిర్వహణ

మల్లెపాడు గ్రామంలో పాఠశాల, అంగన్వాడి కేంద్రాలు ఉన్నప్పటికీ కనీసం పక్కా భవనాలు ప్రభుత్వం మంజూరు చేయలేదు. దీంతో ప్రస్తుతం రేకుల షెడ్డులలో విద్యార్థులకు పాఠాలు బోధించవలసిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం తక్షణమే పాఠశాల, అంగన్వాడి భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు

కర్రలే విద్యుత్ స్తంభాలు

మల్లెపాడు గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పించినప్పటికీ సంబంధిత అధికారులు అర కొరగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వదిలి వేయడంతో ప్రమాద భరితంగా తీగలు వేలాడుతున్నాయి. గమనించిన గ్రామస్తులు కర్రలపై తీగలను కట్టి విద్యుత్ సరఫరా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మల్లెపాడు గ్రామానికి రోడ్డు, తాగునీటి, పాఠశాల, అంగన్వాడీ భవనాలు వంటి కనీస మౌలిక వసతులు కల్పించక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నామని, కూటమి ప్రభుత్వం తక్షణమే సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తుడు లక్ష్మణరావు కోరారు.


డోలీలో మోసుకెళుతున్న బంధువులు


ఊటనీటిని పట్టుకుంటున్న మహిళలు


రేకుల షెడ్డులో ఉన్న పాఠశాల


నదిలో మృతదేహాన్ని తీస్తున్న దృశ్యం

గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-చింతూరు

విహారయాత్రకు వచ్చి మండలంలోని కల్లేరు గ్రామపంచాయతీ పరిధి సీలేరు నదిలో ఆదివారం మునిగిపోయి గల్లంతైన నాగులపల్లి దిలీప్, శ్రీనివాసుల మృతదేహాలు మూడు రోజుల తర్వాత శబరి నదిలో లభ్యమయ్యాయి. ఎన్‌డిఆర్ఎఫ్, పోలీసు బృందాలు మూడు రోజుల పాటు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాలను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి పంచనామా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన ఇద్దరు విగత జీవులు కావడంతో తమ వారి కోసం ఎదురు చూసిన కన్నవారు, ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు శోకచంద్రంలో మునిగిపోయారు. సరదాగా సంతోషంగా తమ మధ్య గడిపే మిత్రులు భయానకంగా మృతదేహాలుగా మారి కనిపించడంతో తోటి వారు గుండెలవిసేలా విలపించారు.

గాలింపునకు సహకరించిన జమాల్ ఖాన్

యువకులు గల్లంతైన రోజు నుండి మూడవ రోజు వరకు అధికార యంత్రాంగంతో పాటుగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ తన సిబ్బందితో నాటు పడవలను ఏర్పాటు చేసుకొని గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. మృతదేహాలు లభ్యమైన వెంటనే ప్రభుత్వ వైద్యులను సిబ్బందిని ఫోన్లో సంప్రదించి పంచనామా వెంటనే జరిగేలా చేశారు. అంతిమ సంస్కారాలకు తన జెసిబి సహాయంతో సమాధులను తవ్వించి దగ్గర ఉండి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి ఇంటిలోనూ.. దోమల మందును పిచికారి చేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వర్తనపల్లి, కాడెలి గ్రామాలలో మలేరియా నివారణ మందు పిచికారిని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిచికారి చేసే గ్రామాల్లో ప్రతి ఇంటిలోనూ తప్పనిసరిగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎంపిక చేసిన గ్రామాలలో మలేరియా, రెవెన్యూ, గ్రామ సచివాలయ శాఖ, వెలుగు, అంగన్వాడీ, వైద్య సిబ్బంది సమన్వయంతో మలేరియా నివారణ మందు ఏ.సి.యం 5శాతంను ప్రతి ఇంటి లోపల పిచికారి చేయాలని పి. హెచ్.సి వైద్య సిబ్బందికి ఆదేశించారు. గ్రామాలలో ముందస్తు సమాచారం అందించాలని, ఇంట్లో నిత్యావసరాలు, వంట పాత్రలపై దగ్గరుండి పరదాలు కప్పించి దోమల మందును పిచికారి జరిపించాలన్నారు. జిల్లాలో. 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల 311 సచివాలయాల ప్రాంతాలలోని 2,086 ఎంపిక చేసిన గ్రామాలలో పిచికారి కార్యక్రమం మొదటి దశను రెండు నెలలలో పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి రెండవ దశ కార్యక్రమాన్ని జూలై ఒకటవ తేదీ నుండి చేపట్టాలని సూచించారు. గ్రామాలలో జ్వర లక్షణాలతో బాద పడుతున్న రోగులను సకాలంలో గుర్తించి రక్త పూతలను సేకరించి మలేరియా నిర్ధారణ పరీక్షలు జరపాలని తెలిపారు. ఏ.సి.టి మందులను వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వాడాలని సూచించారు. దోమతెరల వినియోగంపై గ్రామ స్థాయిలో అవగాహన కలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి యం కిరణ్ కుమార్ , ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, బి లక్ష్మయ్య, పాడేరు సబ్ యూనిట్ అధికారి బి.ధనుంజయ్, పి.హెచ్.సి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


పిచికారిని పరిశీలిస్తున్న డిఎంఅండ్ హెచ్ఓ


ఉపకరణాలు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

వికలాంగ పిల్లలకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం : సమగ్ర శిక్ష, భవిత సెంటర్ల ద్వారా రంపచోడవరం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 40 మంది వికలాంగ విద్యార్థులకు వీల్ చైర్లను, బ్యాటరీ ఆపరేటర్ మోటార్ ట్రై సైకిల్, త్రీ వీలర్ సైకిల్, రూలేటర్ చైల్డ్, బ్రెయిలీ కిట్, వాకింగ్ స్టిక్ వంటి ఉపకరణాలను మంగళవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం పెద్దగద్దాడ జడ్పీ హైస్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌కు హాజరై అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, మాజీ అధ్యక్షులు అడబాల బాపిరాజు, వై నిరంజనీ దేవి, సింహాచలం, సిద్దా వెంకన్న, పండా చెల్లన్న దొర, సురేష్, చవలం బాపన్న దొర,డి జనార్దన్, మీరా, గణపతి, సలాది బాపిరాజు, కోడే రవి బాబు, ఎమ్ అన్నారావు, అప్పారావు, వీరబాబు, చర్పంచ్ ప్రసాద్, సత్యవతి, రమణ, పెంటమ్మ కొండబాబు, సచివాలయ, స్కూల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


పాడేరులో కురుస్తున్న వర్షం

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరు: మన్యంలో మరోసారి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మంగళవారం మధ్యాహ్నం పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. పాడేరు పట్టణం పిడుగులతో దద్దరిల్లింది. దీంతో భయానక వాతావరణం అలుముకుంది. పాడేరు, చింతపల్లి, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు మండలాలలో భారీ వర్షం ఈదురు గాలులతో కురిసింది. దీంతో పలుచోట్ల ఇళ్ళ పై కప్పు రేకులు ఎగిరిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. పెదబయలు మండలంలోని గబడుపుట్టు వాక్కుపల్లి గ్రామాల్లో కొందరి ఇళ్ల పై కప్పులు ఎగిరి పోయాయి. గత శుక్రవారం పాడేరు పట్టణంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించి చెట్లు విరిగి పడిన ఘటన మొదలుకొని ప్రతిరోజు మధ్యాహ్నం మబ్బులు కమ్మేసరికి అంతటా అలజడి రేగుతోంది. మధ్యాహ్నం వేళ కారు మబ్బులు అలుముకొని భారీ వర్షం కురుస్తోంది. భారీ వర్షాల కారణంగా మన్యంలో చల్లని వాతావరణం నెలకొంది. మన్యంలో ఈ భారీ వర్షాలు వేసవిని మరిపిస్తున్నాయి.


లోకేష్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న గిడ్డి ఈశ్వరి, పాస్టర్లు

లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మంత్రి లోకేష్ చిత్రపటానికి టిడిపి పాడేరు నియోజకవర్గ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో పాడేరు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పాస్టర్లు పాలాభిషేకం చేశారు. యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ ఇచ్చిన మేరకు గుడ్ ఫ్రైడే సందర్భంగా పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లింపులకు రూ.30 కోట్లు నిధులు విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ, యువగళం పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవటం..సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఎం.బాబురావు, పి.ఫ్రెడ్రిక్, జి.తిమోతి, వైవై రత్నం, ఎస్.సాల్మన్ రాజు, ఎం.డానియల్, పి.సాల్మన్, వి.మత్స్యరాజు, పి.డేవిడ్, యుసివైఎ ప్రతినిధులు కె.సత్యారావు, ఎం.స్టీవెన్ శ్రీనివాస్, డి.రవికుమార్, టిడిపి నాయకులు బొర్రా విజయరాణి, డి.వెంకటరమణ(బుజ్జి), సర్పంచ్ ఎల్.పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోడు వ్యవసాయం చేస్తే చట్టపరమైన చర్యలు

అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-సీలేరు

ఎవరైనా పోడు వ్యవసాయం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ జికె.వీధి తహశీల్దారు రామకృష్ణను ఆదేశించారు. జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీలో గత ఏడాది సెప్టెంబర్ 8న భారీ వరదలకు ఇళ్లు, పొలాలు కొట్టుకుపోయి చట్రాపల్లి గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ నివసిస్తున్న గిరిజనులు స్థితిగతులు, గ్రామానికి ఎదురుగా ఉన్న కొండపై భాగంలో తాత్కాలికంగా గిరిజనులు నిర్మించుకున్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం దారకొండ పంచాయతీ తోకరాయిలో గ్రామసభ నిర్వహించారు. తోకరాయి ప్రాంతంలో పర్యావరణానికి ముప్పు కలిగేలా పోడు వ్యవసాయం చేస్తున్నారని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడు వ్యవసాయం వల్ల వరదల సమయంలో పెను ప్రమాదం సంభవిస్తుందని హెచ్చరించారు. పోడు వ్యవసాయాన్ని ఎవరు ప్రోత్సహించొద్దని హితవుపలికారు. ఎవరైనా పోడు వ్యవసాయం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామంలో కొంతమంది పింఛన్లు రాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, అర్హులైన వారికి పింఛన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దారును ఆదేశించారు. అనంతరం చోడురాయిలో వరదలకు కొట్టుకుపోయిన కల్వర్టు, మాదిగమల్లు వంతెనను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వీటి నిర్మాణానికి కోటి 80 లక్షల రూపాయలు మంజూరు చేశారు. సంబంధించిన టెండర్లు ప్రక్రియ కూడా పూర్తి చేశారు. దీనికి ముందు దారకొండ పంచాయతీ తోకరాయి గ్రామంలో కలెక్టర్ దినేష్ కుమార్‌కు గిరిజన ఆచార సాంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం దారకొండ పిహెచ్సిని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు గురించి డాక్టర్ హిమబిందును అడిగి తెలుసుకున్నారు.

రహదారికి అడ్డంగా కూలిపోయిన భారీ వృక్షం

కలెక్టర్ పర్యటన ముగించుకున్న అనంతరం అధికారులు తిరిగి ప్రయాణంలో మాదిగమల్లు వంతెన వద్దకి వచ్చేసరికి భారీ గాలులకు చెట్టు రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో అధికారులు ప్రజా ప్రతినిధులు వెళ్లడానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమీప గ్రామస్తులను తీసుకొచ్చి చెట్టును తొలగించడంతో సురక్షితంగా అధికారులు వెళ్లారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి తహశీల్దారు రామకృష్ణ, ఆర్ఐ, సర్వేయరు, పంచాయతీరాజ్ ఈఈ పడాల్, జేఈ జ్యోతి బాబు, జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారి ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


చోడురాయి కల్వర్టు వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఆదర్శ ప్రజా నాయకుడు మడకం వెంకయ్య

ప్రజాశక్తి-చింతూరు

ఆదర్శ ప్రజా నాయకుడు కామ్రేడ్ మడకం వెంకయ్య అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అమరజీవి మడకం వెంకయ్య 20వ వర్ధంతి కార్యక్రమంలో చింతూరు మండలం గూడూరులో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్య చిత్రపటానికి సురేష్, శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే సిపిఎం చింతూరు కార్యాలయంలో జరిగిన వెంకయ్య వర్ధంతి సభలో సురేష్, శ్రీనివాసరావు మాట్లాడుతూ మడకం వెంకయ్య ఉమ్మడి మోతుగూడెం పంచాయతీ సర్పంచ్‌గా, చింతూరు మండల పరిషత్ అధ్యక్షునిగా పని చేశారని తెలిపారు. సీపీఎం డివిజన్ నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి జరిగిన పోరాటాలలో ముందుండేవారని చెప్పారు. ఏజెన్సీలో వెట్టిచాకిరి, శ్రమ దోపిడీ, నక్సల్స్ నిర్బంధం వంటివాటికి వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహానాయకుడు వెంకయ్య అని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలు, వైద్య సౌకర్యాలు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులు ఏర్పాటుకు ఆయన కృషి చేశారని కొనియాడారు. వ్యవసాయ అభివృద్ధికి జీవనదులపై లిఫ్ట్ ఇరిగేషన్లు, ఐటిడిఏ ద్వారా ప్రతి గ్రామంలోని చెరువులు ఏర్పాటు చేయించారని చెప్పారు. వెంకయ్య ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు పోడియం లక్ష్మణ్, ముట్టం రాజయ్య, పత్రా రమేష్, లేక గోవింద్, ముర్రం పిడగయ్య, పాండు నాగార్జున, కురుశం నాగిరెడ్డి పాల్గొన్నారు.



వెంకయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు


బదిలీపై వెళ్తున్న కార్యదర్శి శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

కార్యదర్శికి ఆత్మీయ వీడ్కోలు సన్మానం

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని కూటూరు గ్రామపంచాయతీ సెక్రటరీ నందిక శ్రీనివాసరావు బదిలీ కావడంతో ఆయనకు గ్రామపంచాయతీ పాలక వర్గం, సచివాలయం సిబ్బంది మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఎంపీడీఓ రామాంజనేయ ప్రసాద్, కూటూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, ఎంపీటీసీ ధర్ముల అమ్మాజీ, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, వార్డు సభ్యులు, సిబ్బంది శ్రీనివాసరావుకు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కూటూరు, పెద్దార్కూరు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందని స్థానిక సిడిపిఓ ఎల్.దేవామణి అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయం వద్ద పోషణ పక్వాడలో భాగంగా రాజవొమ్మంగి సచివాలయం పరిధిలో గర్భిణీలు, బాలింతలకు, కిశోర బాలికలకు పౌష్టిక ఆహారం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ నరసింహమూర్తి, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణలత, ట్రైనీ ఎస్ఐ, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీస్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఓ దేవామణి

వేతన బకాయిలు చెల్లించాలని ఉపాధి హామీ కూలీల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వల్ల ఆకలి కేకలతో కూలీలు అలమటిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేసారు. మండలంలోని బుచ్చిరాజుపేట పంచాయతీ నల్లమట్టిపాలెంలో మంగళవారం ఉపాధి కూలీలతో కలిసి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, నెలల తరబడి కూలీలకు పేమెంట్లు చెల్లించకపోతే ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. శాసనసభ్యులు, ఎంపిలకు, జిల్లా అధికార యంత్రాంగానికి నెల తరబడి జీతాలు రాకపోతే ఏమి చేస్తారని ప్రశ్నించారు. కూలి డబ్బుల కోసం ఇంకెంతకాలం ఎదురుచూడాలన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి కూలీలకు బకాయి పేమెంట్లు వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, కెల్లి చిట్టిబ్బాయి, గొర్ల లక్ష్మి, కళ్ళ మంగమ్మ, లక్ష్మి, రాధా, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



యజమానులకు వాహనాలను అందిస్తున్న పోలీసులు

320 వాహనాలు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన మోటార్ వాహనాలను విశాఖ సిటీ పోలీసులు సంబంధిత వాహన యజమానులకు 'వాహన మేళా' ద్వారా మంగళవారం అందజేశారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, వివిధ కేసుల్లో వివిధ సందర్భాల్లో వాహనాలను పోలీసులు సీజ్ చేసిన అనంతరం వివిధ కారణాలతో యజమానులు రిలీజ్ చేసుకోలేక అవి నిరుపయోగంగా మారుతున్నందున ఈ మేళా ద్వారా ప్రజలకు అందజేస్తున్నట్లు వివరించారు. మొదటి సారిగా ఫిబ్రవరి 19 న మొదటి వాహన మేళాను నిర్వహించి 152 వాహనాలను సంబంధిత యజమానులకు అప్పగించామని తెలిపారు. రెండవ మేళా ద్వారా 320 వాహనాలను సంబంధిత యజమానులకు అందజేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు మొత్తం 472 మంది ఈ మేళాల వల్ల లబ్ధిపొందారని సీపీ తెలిపారు.

హెచ్‌ఎంకు ఘన సన్మానం

ప్రజాశక్తి - చీడికాడ: ఏ వృత్తిలో ఉన్నా సేవా దృక్పథంతో పనిచేస్తే సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతారని ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. మండలంలోని అర్జునగిరి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఈనెల 30న పదవీ విరమణ పొందుతున్న లెక్కల ప్రసాద్ రావు మాస్టారికి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సభలో రఘువర్మ మాట్లాడుతూ, సమాజంలోనే ప్రత్యేక గుర్తింపు స్థానం ఒక ఉపాధ్యాయునికి మాత్రమే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణు, జీవి నాయుడు, వరాహమూర్తి పాల్గొన్నారు

కవగుంటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- రావికమతం: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి కోరారు. మండలంలో కవగుంట గ్రామంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, నెలకు ఒక మారు గ్రామంలో నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిబిరానికి 65 మంది వైద్య పరీక్షలు నిర్వహించుకొని, ఉచితంగా మందులు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ రోబ్బా వర కుమారి, మాజీ వార్డ్ మెంబర్లు సిద్ధ దేవుడమ్మ, నడిపల్లి కాంతమ్మ, ఆశ రాము, నూకరత్నం, పచ్చికూర రాము పాల్గొన్నారు

ముత్యాలమ్మ జాతరకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎఎస్‌పి నవ జ్యోతి మిత్రా

ప్రజాశక్తి - చింతపల్లి: ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న ముత్యాలమ్మ జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సన్నాహాలు చేస్తుంది. ఈ సందర్భంగా మంగళవారం జాతర ఏర్పాట్లను ముత్యాలమ్మ ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శులు పసుపులేటి వినాయకరావు, పోతురాజు బాలయ్యలతో కలిసి స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిత్రా, చింతపల్లి సిఐ వినోద్‌బాబు ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమైన కూడళ్లు, వినోద కార్యక్రమాల స్టేజీలను, ఆలయ పరిసరాలను పరిశీలించి కమిటీకి, పోలీసు సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ, భక్తులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణ, భద్రత పరంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నర్సీపట్నం, లంబసింగి వైపు నుండి వచ్చే వాహనాలకు ఆదివాసీ గురుకుల జూనియర్ కళాశాలలో పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించామని, గ సీలేరు, పెదవలసతో పాటు అంతర్ల నుంచి వచ్చే వాహనాలకు జిల్లా పరిషత్ అతిథి గృహం మైదానం, పాడేరు, అన్నవరం, చౌడుపల్లి వైపు నుండి వచ్చే వాహనాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పార్కింగును ఏర్పాటు చేశామని తెలిపారు. శబ్దాల ద్వారా భక్తులను అసహనానికి గురిచేయడం, అసభ్య ప్రవర్తన వంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బేతాళుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టులో నేపాల్ బృందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేపాల్ ప్రభుత్వ వ్యవసాయ పశుసంవర్ధక శాఖ కార్యదర్శి డాక్టర్ గోవింద్ ప్రసాద్ శర్మ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన నేపాల్ ప్రతినిధి బృందం మంగళవారం విశాఖపట్నం పోర్టులో పర్యటించినట్లు పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. నేపాల్ బృందానికి పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులోని మౌలిక సదుపాయాలు, నిర్వహణ సామర్థ్యం, కీలక వసతులపై పోర్టు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అందించారు. గ్లోబల్ టెండర్ల ద్వారా యూరియా, డిఏపి వంటి ఇతర ఎరువుల దిగుమతి అవకాశాలను అన్వేషించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని పోర్టు అధికారులు పేర్కొన్నారు. ఇండో-నేపాల్ ఎరువుల సరకు ఒప్పందం (ట్రీటీ)లో భాగంగా, ప్రస్తుతం కోల్‌కతా పోర్టులో అమలు అవుతున్న విధంగా, విశాఖపట్నం పోర్టు ద్వారా కూడా బల్క్ రవాణాకు అనుమతి కల్పించే ప్రతిపాదనపై చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. దీని ద్వారా కనీసం రెండు లక్షల టన్నుల అదనపు ఎరువుల సరుకు రవాణా సాధ్యమవుతుందని అంచనా వేశారు. విశాఖపట్నం పోర్టుకు వాణిజ్య పరంగా విస్తృత అవకాశాలు ఉన్నాయని నేపాల్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో క్రిషి సమగ్రి కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సాల్ట్ ట్రేడింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ అసిస్టెంట్ సిఇఒ పాల్గొన్నారు.



విశాఖ పోర్టు అధికారులతో భేటీ అయిన నేపాల్ బృందం

కెజిహెచ్‌లో సమయపాలన పాటించాలి

అదనపు డిఎంఇ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో వైద్యులు సమయపాలన పాటించాలని, ఎన్‌టిఆర్ వైద్య సేవ కేసులను మరింత పెంచాలని అదనపు డిఎంఇ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన కింగ్ జార్జ్ హాస్పిటల్‌ను సందర్శించారు. ముఖ్యంగా హాస్పిటల్‌లోని ఎమర్జెన్సీ (క్యాజువల్టీ) విభాగాన్ని పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పలు మార్గదర్శకాలు చేశారు. తర్వాత హాస్పిటల్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని సందర్శించి, నర్సింగ్ సూపరింటెండెంట్‌తో నర్సింగ్ సిబ్బంది రోస్టర్లు గురించి చర్చించారు. అనంతరం త్వరలో ప్రారంభించబోయే కొత్త వార్డులను కూడా పరిశీలించారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్, కెజిహెచ్ సూపరింటెండెంట్, హాస్పిటల్ ప్రతినిధులు, అన్ని విభాగాల హెడ్‌లు, ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రోగుల సంరక్షణకు అవసరమైన పరికరాలను జెమ్ పోర్టల్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిపి సంధ్యాదేవి తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అదనపు డిఎంఇ డాక్టర్ వెంకటేశ్వరరావు

దళితులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 16న పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో దళిత యువకుడైన పల్లపు సురేష్ అగ్ర కులస్తుల ఇంట్లో ఎలక్ట్రికల్ వర్క్ చేస్తూ చనిపోతే ఆ కుటుంబానికి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అడిగిన పాపానికి అక్కడ అదే గ్రామంలో ఉన్న అగ్రకులస్తులు దళితులను గ్రామం నుండి సాంఘిక బహిష్కరణ చేశారన్నారు. వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలోనే ఇంత దారుణం జరగడం అన్యాయమన్నారు. ఈ ఘటనపై డిప్యూటీ సీఎం స్పందించి తక్షణమే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, సాంఘిక సంక్షేమ శాఖ డిడికి విచారణకు ఆదేశించి తక్షణమే అరెస్టు చేసి దళిత బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పెద్దాడ లోవరాజు మాట్లాడుతూ, దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బహిష్కరణ గురిచేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలన్నారు. రెల్లి మహిళ హక్కుల సాధన కమిటీ జిల్లా అధ్యక్షురాలు యర్రంశెట్టి వరలక్ష్మి మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీలకు కఠిన చట్టాలు ఉన్నప్పటికీ అవి అమలు చేయడంలో విఫలమవు తున్నారన్నారు.

విశాఖ మార్కెట్‌లోకి ఏసర్ మొబైల్ విడుదల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ కంప్యూటర్ సంస్థ ఏసర్ తన ట్రేడ్ మార్క్ లైసెన్స్ ఒప్పందంలో భాగంగా అత్యాధునిక కెమెరా ఫ్యూచర్లతో కూడిన రెండు స్మార్ట్ ఫోన్ లను మంగళవారం విశాఖ మార్కెట్‌లో విడుదల చేసింది. ఏసర్ ప్రతినిధి ప్రసాద్ వివరాలను వెల్లడించారు. తమ సంస్థ సూపర్ జెడ్ ఎక్స్ సిరీస్‌లో భాగంగా ఏసర్ సూపర్ జెడ్ ఎక్స్, ఏసర్ సూపర్ జెడ్ ఎక్స్ ప్రో మోడళ్లను మార్కెట్లోకి ప్రవేశపెడుతుందని తెలిపారు. రూ.15 వేల సెగ్మెంట్లో మొదటిసారి ఫుల్ హెచ్‌డి డిస్‌ప్లేతోపాటు స్లిమ్ డిజైన్లు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. మీడియా టెక్ 6300 చిప్ సెట్ ద్వారా ఇది పనిచేస్తుందని తెలిపారు. 64 మెగాపిక్సల్ సామర్థ్యం కలిగిన సోనీ సెన్సార్ ట్రిపుల్ కెమెరాను అందిస్తున్నామని, 33 వాట్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్‌తో బ్యాటరీ అత్యంత వేగంగా చార్జింగ్ అవుతుందని తెలిపారు. ఈ మొబైళ్లు ఆండ్రాయిడ్ 15 ఆధారంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. 4జిబి, 8 జిబి, 128జిబి, 256 జిబి విభాగాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్టైలిష్ బ్లాక్, క్లాసిక్ బ్లూ, ఎలిగేంట్ గ్రీన్ రంగులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రో మోడల్‌లో 512 జిబి సామర్థ్యంతో మార్కెట్లోకి విడుదల చేసినట్లు తెలిపారు.

అమెజాన్‌లో వేసవి ప్రత్యేక ఉపకరణాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో చల్లగా, సౌకర్యవంతంగా ఉండటానికి అమెజాన్ డాట్ ఇన్ ద్వారా వేసవి ప్రత్యేక ఉపకరణాలు అందిస్తున్నామని సంస్థ ఉత్తరాంధ్ర హెడ్ ప్రేమియం తెలిపారు. బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమం ఆయన మీడియాతో మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తమ సంస్థ వినియోదారులకు అవసరమైన పానీయాల నుంచి శక్తిని కలిగించే బూస్టర్స్ వరకు, పెట్ గ్రూమింగ్ అవసరాలు, బేబీ కేర్ ఉత్పత్తుల వరకు అన్నిటిని అందుబాటులో ఉంచిందని తెలిపారు. వేసవి ఉపశమనాన్ని పొందేందుకు తమ వద్ద ప్రముఖ బ్రాండ్స్ అయిన లిక్విడ్ ఐవి, స్లీపీ ఔల్, గ్లూకాన్-డీ, హిమాలయ, బాంబూ నేచర్, పెట్ విట్, గూఫీ టైల్స్‌తో పాటు చిన్నారుల కోసం బాంబూ నేచర్ డిస్పోజబుల్ స్విమ్ డైపర్ ప్యాంట్లు, ఈజీ-టియర్ సైడ్స్ శిశువు కోసం హిమాలయ పౌడర్, కేబుల్ వరల్డ్ మ్యూజికల్ కీబోర్డ్ మ్యాట్ పియానో జిమ్ మ్యాట్ జిమ్, ఫిట్ నెస్ ర్యాక్ తదితర ప్రత్యేకమైన ఉపకారణాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

'స్మార్ట్ మీటర్లు మాకొద్దు'

ప్రజాశక్తి- మాడుగుల: మండల కేంద్రంలో సిపిఎం ఆద్వర్యాన బస్సు స్టాండ్ వద్ద స్మార్ట్ కరెంట్ మీటర్ వద్దు పాత మీటర్లే ముద్దు అంటూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఇరట .నరసింహమూర్తి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. స్మార్ట్ మీటర్లు వద్దని పెడితే పగలగొట్టండి అని ప్రతిపక్షంలో ఉండగా లోకేష్ పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. కరెంటు బిల్లులో స్మార్ట్ మీటర్లకు 15 వేల రూపాయలు వాయిదాలు పద్ధతిలో వసూలు చేస్తారని, ఈ ఒప్పందం చేసుకోవడాన్ని తొలి నుండి సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై. భారం వేయడం దుర్మార్గమన్నారు. పార్టీలక తీతంగా రాష్ట్ర ప్రజలు ప్రభుత్వాలను నిలదీయాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు ఆపాలని, పెంచిన చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వడదెబ్బపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్

ప్రజాశక్తి- అడ్డతీగల : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సన్ స్ట్రోక్ (వడదెబ్బ)పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వడదెబ్బ విషయంలో అజాగ్రత్తగా ఉండకూడదన్నారు. ఎవరైనా వడ దెబ్బకు గురైతే కంగారు పడకుండా దగ్గరలో ఉన్న హాస్పిటల్‌కి వెళ్లి చూపించుకోవాలన్నారు. హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ పండా సతీష్ మాట్లాడుతూ జ్వరం రావడం, తలతిరగడం, గుండె ఎక్కువగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడడం, వాంతులు, యూరిన్ పసుపు రంగులో ఉన్నడడం, మజిల్ బిగుతూ అయిపోవడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలో ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఫస్ట్ ఎయిడ్‌గా చల్లటి ప్రదేశం, దుస్తులు వదులుగా చేయడం, తలభాగం, చంక భాగాలలో ఐస్ పెట్టడం, ఒకవేళ మెలకువగా ఉంటే, ఒఆర్ఎస్, కొబ్బరి నీళ్ల ఇవ్వడం, గ్లూకోస్ నీళ్ల పట్టించడం వంటివి చేయాలని కోరారు. ఎండలో వెళ్ళేటప్పుడు తలకు టోపీ, కూలింగ్ గ్లాస్‌లు, కాటన్ దుస్తులు వేసుకోవడం, గ్లూకోస్ వాటర్ తాగడం చేయాలని, శీతల పానీయలు జోలికి వెళ్ళకూడదని హితవుపలికారు.

ఘనంగా లెనిన్ జయంతి



లెనిన్ జయంతిసభలో మాట్లాడుతున్న సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నేత

ప్రజాశక్తి రంపచోడవరం : విప్లవ వేగుచుక్క కామ్రేడ్ ఐవి.లెనిన్ 155 జయంతి, సిపిఐఎంఎల్ 56వ ఆవిర్భావ దినోత్సవం రంపచోడవరం మార్క్స్ ఎంగెల్స్ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కుంజ దూలయ్య, పల్లాల లచ్చిరెడ్డి, కత్తుల బాలురెడ్డి, పిఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి పల్లాల అనసూయ, జిల్లా నాయకులు సాధన చిలకమ్మా, మడకం జోగమ్మ, మనసాల లింగారెడ్డి, పల్లాల ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల : సిపిఐ ఎంఎల్ 56వ ఆవిర్భావ దినోత్సవం కోత్తూరుపాడు గ్రామంలో సిపిఐఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ, గిరిజన సంఘదం కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వంలో. 1969 ఏప్రిల్ 22న భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్. లెనినిస్ట్ పార్టీ ఆవిర్భవించిందని చెప్పారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం విరోచితమైన పోరాటాలు చేసిన ఘనత కమ్యూనిస్టులదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమల కుసల, నాగులపల్లి అర్జునుడు, సూపర్తి రాజు, గజ్జల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పల్సర్ బైక్ అపహరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని వట్టిగడ్డ గ్రామంలో ఇంటి వద్ద పార్కు చేసిన పల్సర్ బైక్‌ను సోమవారం రాత్రి చోరీకి గురైంది. మండలంలోని ఒట్టిగడ్డ గ్రామంలోని మాకిరెడ్డి లోవరాజు తన ఏపీ40సీసీ 1092 నంబర్ పల్సర్ బైక్‌ను రోజు లాగానే తన ఇంటి వద్ద సోమవారం రాత్రి పార్క్ చేసాడు. ఉదయం లేచి చూసేసరికి బైకు లేదని లోవరాజు తెలిపాడు. చుట్టుపక్కల వెతికిన కనిపించలేదని ఇది మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు లోవరాజు తెలిపాడు.

సుహిత అనుపమ్ కెరీర్ స్ఫూర్తిదాయకం

సివిల్స్ విజేత, గీతం పూర్వవిద్యార్థిపై లఘు చిత్రం



సుహిత అనుపమ్

ప్రజాశక్తి-మధురవాడ : సివిల్ సర్వీసుల పట్ల విద్యార్థులలో ఆసక్తిని కలిగించడానికి, స్ఫూర్తిని నింపడానికి గీతం విశ్వవిద్యాలయం నుంచి ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసి, ఐపిఎస్‌కు ఎంపికై బీహార్‌లో పోలీసు అధికారిగా విధులు నిర్వహిస్తూ భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక గ్యాలంటరి అవార్డును అందుకున్న కె.సుహిత అనుపమ్‌పై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లఘు చిత్రాన్ని రూపొందించింది. బీహార్‌లోని కిరాతక హంతకుల మెడలను వంచిన మహిళా ఐపిఎస్ అధికారిగా ప్రశంసలు అందుకున్న కె.సుహిత అనుపమ్, దేశంలో గ్యాలంటరి అవార్డు అందుకున్న మూడవ మహిళగా గుర్తింపు పొందింది. జాతీయ సివిల్ సర్వీసల దినోత్సవం సందర్భంగా కె.సుహిత అనుపమ్ ఆన్‌లైన్‌లో ప్రసంగించారు. 10వ తరగతి వరకు గుంటూర్‌లో విద్యాభ్యాసం చేసిన తాను ఇంటర్ తరువాత గీతంలో ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసానని తెలిపారు. సివిల్ సర్వీసులలోకి ప్రవేశించాలన్న తన కోరికకు గీతం అధ్యాపకులు ఎంతో సహకరించారన్నారు. మొదటి ప్రయత్నంలో తడబడినా, మలిప్రయత్నంలోనే సివిల్స్‌లో విజయం సాధించానన్నారు. స్వయంగా తయారు చేసుకున్న నోట్స్ తనకు ఎంతో ఉపయోగపడిరదన్నారు. ముఖ్యంగా గీతంలో సివిల్ ఇంజనీరింగ్ చదువుతూ గీతం గ్రంథాలయంలో లభించే పుస్తకాలు, పత్రికల ద్వారా విషయ పరిజ్ఞానం పెంచుకున్నానన్నారు. మిగిలిన పరీక్షలతో పోల్చితే సివిల్ సర్వీసుల పరీక్షలు పారదర్శకంగా జరుగుతాయని, సమయ పాలన, చుట్టూ ఉన్న సమాజంలో జరుగుతున్న విషయాలపై లోతైన అవగాహన, స్వయం విశ్లేషణ సివిల్స్‌కు ఎంతో ఉపయోగకరమన్నారు. తనకు చిన్నతనం నుంచి చరిత్ర, జాగ్రఫి అంటే ఎంతో ఇష్టం అని, అలాగే ఎక్కువగా నేషనల్ జియోగ్రఫిక్ ఛానల్ తరచు వీక్షిస్తానని తెలిపారు. సివిల్స్‌లో తనకు ఇవి ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. పోటీ పరీక్షల పుస్తకాలు చదవడం, నమూనా ఇంటర్వ్యూలకు హాజరుకావడం, ముందు నుంచి లక్ష్యంపై స్థిరమైన అభిప్రాయంతో ఉండటం ద్వారా సివిల్స్‌లో విజయం సాధించినట్లు వెల్లడించారు.

సోలార్ తాగునీటి బోర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధిలో గతంలో మంజూరైన వలస ఆదివాసీ గ్రామాల్లో సోలార్ మంచినీటి బోర్లను తక్షణమే ఏర్పాటు చేయాలని, మౌలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆ గ్రామ సచివాలయం వద్ద ప్రజలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు మల్లం సుబ్బమ్మ, సవలం కన్నయ్య మాట్లాడుతూ ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధిలోని 8 వలస ఆదివాసీ గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి గతంలో సోలార్ మోటర్లు మంజూరు చేసినట్లు అధికారులు ప్రకటించారని, కానీ నేటికీ వాటిని ఏర్పాటు చేయలేదని తెలిపారు. దీంతో ఆదివాసీలు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంజూరైన సోలార్ మంచినీటి బోర్లను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. వలస ఆదివాసీ గ్రామాల ప్రజలు మంచినీరు, విద్యుత్, రహదారులు వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులు కల్పించడం లేదని, జాబ్ కార్డులు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మడివి రాజేష్, సవలం దేశయ్య, కూర గంగయ్య, మడివి హిరమయ్య, రవ్వ జోగయ్య, దేవయ్య నూపా సాయి, ముచ్చిక జోగయ్య మడివి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేత మల్లమ్మ

వికలాంగుల శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్ద మంగళ వారం నిర్వహించిన వికలాంగుల శిబిరం విజయ వంతమైంది. మండలం లోని చుట్టుపక్కల గ్రామాల నుండి సుమారు 280 మంది వికలాంగులు 250 మంది సహాయకులు వచ్చారు. వైద్య పరీక్షలు జరిగిన వికలాంగులకు త్వరలో ఉపకరణాలు ఇవ్వబడతాయని ఎంపీడీవో శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. మండల పరిషత్ తరపున శిబిరానికి వచ్చిన వారందరికీ ఉచిత వసతులతో పాటు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లలిత కుమారి, జెడ్పిటిసి బాలాజీ బాబు, వికలాంగుల శాఖ ఏడి జె మాధవి, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు ఆర్టిఫిషియల్ లింబ్స్, మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైద్యులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వికలాంగులు

మలేరియా రహితమే లక్ష్యం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలం తామరపల్లి పంచాయతీలో మలేరియా రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నట్లు ఆ పంచాయతీ సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి, ముసురుమిల్లి ఎంపీటీసీ వంశి కుంజం అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి తప్పకుండా మందు పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం నూనెపల్లి స్కూల్‌ను పరిశీలించి పిల్లలు చదువు, భోజనం ఎలాఉందో అడిగితెలుసుకున్నారు. పీసా ఉపాధ్యక్షులు బంధం రవి, చిరంజీవి, ఏంఎల్‌హెచ్‌పి బుల్లియమ్మ, హెల్త్ అసిస్టెంట్ సతీష్, మోహనరావు, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, అంగన్వాడీ టీచర్, విఓఎ, ఆశాలు పాల్గొన్నారు.



దోమల నివారిణి పిచికారీ పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

41.15 కాంటూరులో కలపాలని లేఖ

ప్రజాశక్తి- కూనవరం : తెలుగు యువత అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆర్ అండ్ ఆర్ కమిషనర్ రామ్ సుందర్‌రెడ్డిని కలిసి పోచవరం, కాచవరం పంచాయతీలను 41.15 కాంటూరులో చేర్చాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇచ్చిన లేఖను అందజేశారు. దీనికి ఆయన స్పందించి ఈ లేఖను ఎండార్స్ చేసి ఈ గ్రామ పంచాయతీలను మొదటి కాంటూరు 41.15లో చేర్చాలని ఆర్ అండ్ ఆర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అభిషేక్‌కు ఫోన్‌లో ఆదేశించినట్లు రంజిత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, చంద్రుగొండ ఏడుకొండలు, గారపాటి రాంబాబు, షేక్ సుభాని, కొయ్యల బుచ్చిరాజు, సంతపురి చిన్న వెంకటేశ్వర్లు, కుచ్చర్ల పాటి ప్రసాద్, రాజు, పూనెం వెంకటేశ్వర్లు, కట్టం నాగేశ్వరరావు, కట్టం మనోజ్, కాపుల మహేష్, బొర్రా రాంబాబు తదితరులు పాల్గొన్నారు



లేఖను అందజేస్తున్న తెలుగు యువత నేత

ఇంటర్న్‌షిప్ ధ్రువపత్రాల పంపిణీ



ఇంటర్న్‌షిప్ పత్రాలు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే శిరీషాదేవి


ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (బాలికల) పాఠశాలకు చెందిన ఇంటర్న్ షిప్ పొందిన విద్యార్థులకు మంగళవారం ధ్రువపత్రాలను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు 2024 -25 విద్యా సంవత్సరానికి వేసవి సెలవులలో అపారల్, బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సు ఇంటర్న్ షిప్ పూర్తి చేశారని తెలిపారు.

క్రీడల్లో రాణించిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-రంపచోడవరం : ఇటీవల జరిగిన రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లోని పలు విభాగాలలో గోల్డ్ మెడల్స్ సాధించిన కె.ఎర్రంపాలెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులను రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి ప్రశంసించారు. కేవలం చదువులోనే కాకుండా ఆటలలో కూడా చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గేదె మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి రాజవొమ్మంగి గ్రామ శివారు శాంతినగర్ సమీపంలో మంగళవారం విద్యుత్ షాక్ గురై రాజవొమ్మంగి గ్రామానికి చెందిన రైతు అప్పారావుకు చెందిన చూడిగేదె మృతి చెందింది. ఈ గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుంది. గాలికి పడిపోయిన విద్యుత్తు తీగలు గేదెకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురైంది. ఈ సమయంలో గేదె గర్భంలో నుండి దూడ బయటకు వచ్చి మృతి చెంది ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. రూ.60వేలు విలువైన గేదెను పోగొట్టుకున్న రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మృతి చెందిన చూడి గేదె